క్లుప్తంగా

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ఎల్లారెడ్డి : అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అగ్నిమాపక శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాద వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఎల్లారెడ్డి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాల నివారణ గురించి సిబ్బందికి, రోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ కిష్టయ్య, ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రవీంద్రమోహన్ తదితరులున్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో శుక్రవారం విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించారు. వసతి గృహంలోని 169 మంది విద్యార్థులకు ఆప్తాల్మిక్ వైద్యులు హరికిషన్ కంటి పరీక్షలను నిర్వహించి మందులను అందించారు. కార్యక్రమంలో వార్డెన్ పాపయ్య తదితరులున్నారు.

పిట్లంలో..



పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ శాఖ కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు భాస్కర్‌రెడ్డి 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కిషన్, వైద్యులు సమద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు అండగా ఉంటాం

రామారెడ్డి : రామారెడ్డి మండలం మద్దికుంటలో రేషన్ డీలర్ జొన్నల బాలనాగయ్య గత నెల 29న అనారోగ్యంతో చనిపోయారు. వారి కుటుంబానికి కామారెడ్డి జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నుంచి రూ. పదివేలను జిల్లా సంఘం ఆధ్వర్యంలో మృతుడి పెద్ద కుమారుడైన సంతోష్‌కు శుక్రవారం మద్దికుంటలో అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, ఎల్లారెడ్డి డివిజన్ అధ్యక్షులు విజయ్ లింగంపేట ప్రభాకర్ తదితరులున్నారు.

నేడు షబ్బీర్ అలీ రాక

బీబీపేట: మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఫంక్షన్ హాల్‌లో నేడు జరిగే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ రానున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేష్ తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ షెట్కార్ కూడా హాజరుకానున్నారన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : రాబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. తాడ్వాయి మండల కేంద్రంతో పాటు చందాపూర్, ఎర్రాపహాడ్, సంతాయిపేట్ తదితర గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు అకిల్‌రావు, నాయకులు శ్యాంరావు, లక్ష్మణచారి ఉన్నారు.

గుంత పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : 'ప్రమాదకరమైన గుంత' శీర్షికన ఈనెల 16న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నస్రుల్లాబాద్ మండలంలోని బొప్పాస్ పల్లి–లింగంపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ప్రమాదకరమైన గుంత ఉండటంతో వాహన చోదకులకు ఇబ్బంది తలెత్తుతుందని కథనం ప్రచురితం కాగా ఆర్అండ్‌బీ ఏఈ భానుచందర్ స్పందించారు. దీనితో శుక్రవారం గుంతను పూడ్చివేశారు.

చలివేంద్రం ఏర్పాటు



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని గడి హనుమాన్ ఆలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్వకేట్ రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, శేక్ నజీర్, బొడ్లరాజు ఉన్నారు.

జోరుగా కుస్తీ పోటీలు



నిజాంసాగర్‌లో మల్లయోధుడికి ఐదు తులాల వెండి కడియాన్ని బహూకరిస్తున్న నిర్వాహకులు



పిట్లంలో కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

పిట్లం(జుక్కల్) : పిట్లం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీలు గ్రామస్తులను అలరించాయి. శ్రీరామనవమి సందర్భంగా గురువారం రాత్రి రథోత్సవం నిర్వహించారు. శుక్రవారం కుస్తీ పోటీలు, జాతర నిర్వహించారు. ఈ పోటీలకు తెలంగాణకు చెందిన మల్లయోధులతో పాటు మహారాష్ట్ర, కర్నాటకకు చెందిన మల్లయోధులు పోటీలలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. రూ. 10 నుంచి ప్రారంభమైన కుస్తీ పోటీలు చివరి కుస్తీ 10 తులాల వెండి వరకు కొనసాగాయి. కుస్తీ పోటీలలో విజేతగా నిలిచిన వారికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నగదు, బహుమతి అందజేశారు.

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని భవానిపేట గ్రామంలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. టెంకాయ కుస్తీ నుంచి వెండి కడెం కుస్తీ వరకు పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందజేశారు. చివరి కుస్తీ పోటీల్లో గెలుపొందిన నాందేడ్ జిల్లా బిజిరెల్లి చెందిన సంజయ్‌కు నాలుగు తులాల వెండి కడియం బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వలో పోచమ్మ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మల్లయోధుల కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతలతో పాటు రాష్ట్రానికి చెందిన మల్లయోధులకు తరలివచ్చారు. కుస్తీపోటీల్లో గెలుపొందిన మల్ల యోధుల కు ముప్పిడి రాంప్రసాద్ గుప్తా, చింతల సంతోష్‌సేట్, చింతల నరేశ్‌సేట్, గొర్గంటి రాము లు 2 నుంచి 5 తులాల వరకు వెండి కడియాలను బహుమతులుగా అందజేశారు. గ్రామ పెద్దలు గొట్టం నర్సింలు, రాజేశ్వర్‌గౌడ్, గంగారాం ఉన్నారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని అల్మాజీపూర్‌లో శుక్రవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా కుస్తీ పోటీలను నిర్వహించారు. కొబ్బరికాయ కుస్తీ నుంచి వెండి కడియం కుస్తీ వరకు పోటీలను నిర్వహించారు.



అల్మాజీపూర్‌లో తలపడుతున్న మల్లయోధులు



భవానీపేటలో కుస్తీ పోటీలో విజేతలకు వెండికడియం బహూకరిస్తున్న నిర్వాహకులు

బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

భిక్కనూరు : పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ ఇతర పార్టీలో చేరేందుకు యత్నిస్తున్న భిక్కనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాణాల అమృత్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు రామేశ్వర్‌పల్లి బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అనంత్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ నాగార్తి భూంరెడ్డిలు తెలిపారు. శుక్రవారం వారు భిక్కనూరులో విలేకరులతో మాట్లాడుతూ అమృత్‌రెడ్డి కొన్ని రోజులుగా పార్టీకార్యకలాపాలకు దూరంగా ఉండడంతో పాటు పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నాడని ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్దన్ దృష్టికి తీసుకెళ్లామని ఆయన ఆదేశాల మేరకు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు వారు చెప్పారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ పోతిరెడ్డి, నేతలు కట్టకింది తక్కళ్ల రవీందర్‌రెడ్డి, పైతరి స్వామి, జిల్లెల రవీందర్‌రెడ్డి, మద్ది ప్రమోద్‌రెడ్డి, దాసరి నర్సింలు, తక్కళ్ల మధుసూదన్‌రెడ్డి, కేతి మధు, చేపూరి అశోక్, కడారి శివరాములు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగించాలని ఫిర్యాదు

బాన్సువాడ : బాన్సువాడ బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ అలీం, చైర్మన్ జంగం గంగాధర్‌లకు అంబేద్కర్ సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం సభ్యులు మల్లూరి సాయిలు, వెంకటేష్ మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అంబేద్కర్‌ను అవమానిస్తున్నారన్నారు. అనంతరం పట్టణ సీఐ కృష్ణకు ఫిర్యాదు చేశారు.

ఉపాధి పనుల పరిశీలన



బీబీపేట : మండలంలోని మాందాపూర్‌లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి చందర్ నాయక్ పరిశీలించారు. వాటరింగ్ డే సందర్భంగా మొక్కలకు నీళ్లు పోశారు. అనంతరం మండల కార్యాలయంలో సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణచంద్రోయకుమార్, ఏపీఎం బాలపోచయ్య, ఏపీవో, సిబ్బంది పాల్గొన్నారు.

జుక్కల్ పరిధిలో..



నిజాంసాగర్(జుక్కల్) : జుక్కల్ మండలంలోని జుక్కల్, దోస్తపల్లి, బంగారు పల్లి గ్రామాల్లో కూలీలు చేస్తున్న ఉపాధి పనులను శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఉపాధి పనులు వద్దే కూలీలు హాజరును మస్టర్లల్లో నమోదు చేయాలన్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళాలు



చాముండేశ్వరి ఆలయ రాజగోపుర నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దంపతులు

దోమకొండ : దోమకొండలోని చాముండేశ్వరి ఆలయ రాజగోపుర నిర్మాణానికి శుక్రవారం దాతలు పెద్ద ఎత్తున విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన రిటైర్డు టీచర్ పన్యాల పద్మావతి–బాల్‌రెడ్డి దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొమ్మెర శ్రీనివాస్ దంపతులు రూ.10,116లు అందజేశారు. అదేవిధంగా జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ దంపతులు రూ.25,555 అందజేశారు. వీరితో పాటు డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ రూ.5,116 విరాళంగా అందజేశారు. హైద్రాబాద్‌కు చెందిన మాదుపడగ వెంకటేశ్వర్లు రూ.5,116 అందజేశారు. వీరిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలకుర్తి శేఖర్, డైరెక్టర్లు రాజిరెడ్డి, రాజయ్య, పీఆర్‌టీయు మండల అధ్యక్షుడు పన్యాల శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అర్చకులు భావి శరత్‌చంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి



బీర్కూర్ మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారిణి కమల

బాన్సువాడ : నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని సభ్యులు అధికారులకు విన్నవించారు. శుక్రవారం బీర్కూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రఘు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. స్థానిక ఫర్టిలైజర్ దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారందరికి ప్రభుత్వ పరంగా ఎకరానికి రూ. 20 వేల నష్టపరిహారం చెల్లించేలా కృషి చేయాలని సూచించారు. రోడ్డు విస్తరణలో దుమ్ము లేస్తోందని రోడ్లపై నీళ్లు పోయాలని సూచించారు. రోడ్డు వెంట మొక్కలు నాటించాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ రవి, ఎంపీడీవో భానుప్రకాష్, ఎంపీటీసీ సందీప్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేపై యువకుల ఆగ్రహం



గాంధారి(ఎల్లారెడ్డి) : శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా గౌరారం గ్రామానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్ గురువారం రాత్రి వెళ్లారు. వేడుకల్లో భాగంగా గ్రామంలో ప్రతిఏటా ఆర్కెస్ట్రా ఏర్పాటు చేస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్టేజీపైకి ఎవరినీ ఎక్కనివ్వరు. అయితే ఎమ్మెల్యే మదన్‌మోహన్ స్టేజీపైకి వెళ్లి మాట్లాడేందుకు ప్రయత్నం చేశారు. ఏపార్టీ వారైనాస్టేజీ మీదకు ఎక్కొద్దని కొందరు యువకులు వెంటనే దిగిపోవాలని ఆందోళన చేశారు. దీంతో చేసేదేమీ లేక పోలీసుల సాయంతో ఎమ్మెల్యే స్టేజీ దిగి వెళ్లి పోయారు. దీంతో తదుపరి వేడుకలు కొనసాగాయి.

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సన్మానం



ఇందుప్రియకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గంపకృష్ణ

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన గడ్డం ఇందుప్రియను పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గంప కృష్ణ ఆమెను సన్మానించారు. పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

అభ్యున్నతి కోసమే కార్పొరేషన్ల ఏర్పాటు



భిక్కనూరులో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



దోమకొండ పెద్దమ్మ ఆలయ ఉత్సవాల్లో..

భిక్కనూరు : ప్రజల అభ్యున్నతి కోసం ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కులాల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి పది కార్పొరేషన్లను ఏర్పాటు చేశారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. శుక్రవారం ఆయన భిక్కనూరులో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందన్నారు. ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను అమలు చేశామని, ఎన్నికల కోడ్ అడ్డంకితో రూ. 2 లక్షల రుణ మాఫీ ఆగిందన్నారు. పంద్రాగస్టు వరకు అదికూడా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాలిరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, మాజీ ఎంపీపీలు బల్యాల రేఖ, తోగరి సుదర్శన్, విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, ముదిరాజు సంఘం అధ్యక్షుడు బండి రాములు, ప్రతినిధులు నంద రమేష్, నీల అంజయ్య తదితరులున్నారు. అనంతరం షబ్బీర్‌ను భిక్కనూరు ముదిరాజు కర్నాల పాండి యువకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. యువకులు కర్నాల శ్రీనివాస్, వినయ్, సంతోషు, రాజు, ప్రవీణ్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్మిక నేత

కామారెడ్డి టౌన్ : బీఆర్ఎస్ పార్టీ కార్మిక సంఘం నేత గుర్రం నారాయణ ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో చేరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, గోనే శ్రీను తదితరులున్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి పెద్దపీట

దోమకొండ : ముదిరాజ్‌ల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరుగుతున్న పెద్దమ్మ ఆలయ ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ముదిరాజ్‌లకు కార్పొరేషన్ ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. పీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, భిక్కనూరు మండల అధ్యక్షుడు భీంరెడ్డి, జిల్లా నాయకులు అబ్రబోయిన స్వామి, తాటిపల్లి శ్రీకాంత్, రామస్వామిగౌడ్, మండల నాయకులు నాగారపు రాములు, సంతోష్‌రెడ్డి, పిన్నం నాగేంద్రవర్మ, ఆలయకమిటి అధ్యక్షుడు పున్న లక్ష్మన్, కమిటి ప్రతినిధులు పెద్ద బాలయ్య, బోయిని సత్యం తదితరులున్నారు.

ఆధ్యాత్మికం

■ 22 నుంచి ఆలయ జీర్ణోద్ధరణ ఉత్సవాలు



భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్ లక్ష్మీ వెంకటేశ్వరాలయం జీర్ణోద్ధరణ, కల్యాణంను ఈనెల 24వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాటిపల్లి సిద్దరాములు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్దన్‌కు ఈ కార్యక్రమంను ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు ద్యావర సాయిరెడ్డి, విండో చైర్మన్ ఎన్నగ వెంకట్‌రెడ్డి, మాజీ చైర్మన్ వంగేటి నర్సరెడ్డి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ వైభవంగా పెద్దమ్మ–పెద్దిరాజుల కల్యాణం



భిక్కనూరు : మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పచ్చని పందిళ్లలో వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణాల మధ్య పెద్దమ్మ–పెద్దిరాజుల కల్యాణంను వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ కల్యాణోత్సవంలో పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించుకున్నారు. భిక్కనూరుతో పాటు దోమకొండ, కామారెడ్డి, రాజంపేట, బీబీపేట, రామాయంపేట ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బీజేపీ మండల ఇన్‌చార్జి శ్రీధర్ రెడ్డి కట్నకానుకలు సమర్పించుకున్నారు.

■ జగదాంబ, సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠ



ఎల్లారెడ్డి రూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని హాజీపూర్ సడక్ తండాలో శుక్రవారం జగదంబా మాత, సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో అమ్మవారు, సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపన పూర్తి చేశారు.

■ రుక్మిణీ విఠలేశ్వర విగ్రహం..



బాన్సువాడ రూరల్ : మండలంలోని కోనాపూర్‌లో పునర్నిర్మించిన రుక్మిణి విఠలేశ్వర మందిరంలో విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన వేదపండితులు గోవిందుగారి ప్రణీత్‌శర్మ, కోనాపూర్‌కు చెందిన జోషి కిషన్‌పంతులు సంయుక్త ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం రుక్మిణీ విఠలేశ్వర శాంతి కళ్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

■ ధర్మశాలలో వైభవంగా పూజలు



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని ధర్మశాల ఆలయంలో శుక్రవారం వైభంగా పూజలు నిర్వహించారు. వేద పండితుడు సాయిదీక్షిత్ శర్మ ఆధ్వర్యంలో గణపతి, గోపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

■ కాశీ పాదయాత్రికుడికి సన్మానం



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామ పరిధిలో కల్కి నగర్ కోటిలింగేశ్వర అభయంజనేయస్వామి ఆలయం పూజారి మత్స్యేంద్రప్రసాద్ శర్మ 41 రోజుల పాటు కామారెడ్డి నుంచి కాశీ వరకు పాదయాత్ర పూర్తి చేసుకుని కామారెడ్డికి వచ్చిన సందర్భంగా భక్తులు ఘన స్వాగతం పలికారు. కోటిలింగేశ్వరాలయం పూజారి మత్స్యేంద్రప్రసాద్ శర్మ దంపతులను భక్తులు ఘనంగా సన్మానించారు.

■ ఎర్రాపహాడ్‌లో రథోత్సవం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామంలో శుక్రవారం రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని శ్రీరాజరాజేశ్వరాలయం నుంచి కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి వరకు రథాన్ని ఊరేగించారు. చక్కెర తీర్థంనిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. మోహన్‌రెడ్డి, జలందర్‌రెడ్డి, విఠల్ రెడ్డి, నర్సారెడ్డి, ఏనుగు మోహన్‌రెడ్డి ఉన్నారు.

■ ఉత్సాహంగా రామకోటి కార్యక్రమం



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో నిర్వహిస్తున్న శ్రీ రామనవమి వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం రామకోటి కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, చిన్నారులు శ్రీరాముని నామం రామకోటి రాసి తమ మొక్కులను తీర్చుకున్నారు. కమిటీ సభ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

కామారెడ్డి టౌన్ : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కోర్ కమిటీ సభ్యులు మోతిరాం నాయక్, సురేష్ గోండ, చంద్రశేఖర్ నర్సింలు, అరుణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బిచ్కుంద(జుక్కల్) : ఈ నెల 20, 21, 22 తేదీల్లో మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రైతులు సహకరించాలని ట్రాన్స్‌కో ఏఈ పవన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని శాంతాపూర్ సబ్ స్టేషన్‌లో శాంతాపూర్ అగ్రికల్చర్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శాంతాపూర్, సీతరాంపల్లి, మన్యపూర్ గ్రామాలలోని వ్యవసాయ మోటార్ల వద్ద విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని రైతులు సహకరించాలని ఏఈ కోరారు.

కొనసాగుతున్న సప్తాహం



బాన్సువాడ రూరల్ : మండలంలోని కాద్లాపూర్ హనుమాన్ మందిరం వద్ద, కోనాపూర్ గ్రామంలోని శ్రీరుక్మిణీ విఠలేశ్వర మందిరంతో పాటు నా గారం గ్రామంలో సప్తాహ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు చెందిన వార్కారి భక్తులు ఆలపిస్తున్న సంకీర్తణలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈనెల 22న నిండుసర్వలు, మంగళహారతులు, దిండి ఊరేగింపులో సప్తాహం ముగియనుంది.

సెల్‌ఫోన్‌ల అప్పగింత

కామారెడ్డి క్రైం : సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు సీఈఐఆర్ టెక్నాలజీ ఉపయోగకరంగా మారింది. ఇటీవల దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురు సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు ఫిర్యాదు చేయగా శుక్రవారం 4 సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. ఆయా ఫోన్‌లను బాధితులకు ఎస్సై రాజు అప్పగించారు.

ఎగిసిపడిన మిషన్ భగీరథ నీరు



మద్నూర్ : అవాల్‌గావ్ సమీపంలో జుక్కల్ ప్రధాన రహదారి పక్కన పైప్‌లైన్ వాల్ ఓపెన్ చేయడంతో మిషన్ భగీరథ నీరు ఫౌంటేన్ లాగా ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. నీళ్లు భారీ ఎత్తున ఎగిసిపడడంతో ఈ రహదారి వెంట వెళ్లే వాహనదారులు ఈ దృశ్యాన్ని వింతగా చూశారు.